తిరుమలలో రథసప్తమి ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

2లో

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 28, జనవరి 2025 8 పేజీలు

రైతులను విస్మరిస్తే మోడీకి గుణపాఠం తప్పదు

- కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలి
- నూతన మార్కెటింగ్ చట్టాలు రద్దు చేయాలి

విశాలాంధ్ర-పలమనేరు: సభ్యత్వం నమోదు కార్యక్రమం లో రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ కాటమయ్య రైతాంగ వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే కేంద్ర ప్రభుత్వానికి రైతులు తగు గుణ పాఠం చెప్పక తప్పదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.కాటమయ్య హెచ్చరించారు. గత 13 నెలల రైతాంగం ఢిల్లీ కేంద్రంగా నిర్వహించిన మహోద్యమం కేవలం క్షమాపణలకే పరిమితం కాదని ఈసారి కేంద్ర ప్రభుత్వంను శాశ్వతంగా ఇంటికి సాగ నంపుతామని పేర్కొన్నారు. రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పలమనేరు డివిజన్ గంగవరం మండలం జెఆర్ కొత్త పల్లెలో సోమవారం ఆ గ్రామ నూతన కమిటి సభ్యులనుద్దేశించి ఆయన ప్రసంగించారు.. ఈ సందర్భంగా కాటమయ్య మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 3 వ్యవసాయ నల్ల చట్టాలు తిరిగి దొడ్డి దారిన ప్రవేశ పెట్టేందుకే నూతన మార్కెటింగ్, డిజిటల్, సహకార చట్టాల ముసాయిదా పేరున మోడీ ప్రభుత్వం తీసుకొస్తుందని ధ్వజమెత్తారు. దేశ రైతాంగం ఎటువంటి పరిస్థితులలోనైనా కార్పోరేట్ శక్తులకు లబ్ది చేకూర్చుతూ, రైతులను దివాళా తీయాలనే విధానాలను రైతు సంఘం తిప్పి కొడుతుందని పేర్కొన్నారు. రైతు సంఘం సభ్యులను విరివిగా చేర్పించి సంఘాన్ని బలోపేతం చేస్తే ఎలాంటి ప్రభుత్వాన్నైనా సాగనంప వచ్చన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డా. టి.జనార్దన్ మాట్లాడుతూ రైతాంగ ఉద్యమ ఫలితం గానే నేడు ప్రధాని మోడీ, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్ర నేతల మద్దతుతో అధికారంలో కొనసాగుతున్నారని తెలిపారు.రైతులకు అన్ని పంట లకు కనీస గిట్టుబాటు ధర కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని పేర్కొన్నారు. జిల్లా రైతాంగానికి శాశ్వత కరువు నివారణకు హంద్రీ-నీవా ప్రాజెక్టు సత్వరం పూర్తి చేయాలని, మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని, పాలు లీటర్‌కు రూ.50 చెల్లించాలని, తెలిపారు. ఏనుగుల బెడద నుండి రైతాంగ పంటలు, ప్రాణాలు కాపాడేందుకు పోరాడాలన్నారు. జిల్లా వ్యాపితంగా రైతాంగ సమస్యలపై ఉద్యమ కార్యాచరణ కై మార్చి నెలలో జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్మిక నేత బి.మంజునాథ్, రైతుసంఘం నియోజకవర్గం నేత, శంకరప్ప, కదిరప్ప రవి, రఘు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన గ్రామ కమిటీ అధ్యక్షులుగా దేవేంద్ర, కార్యదర్శిగా రవి, ఉపాధ్యక్షులుగా చంద్రకుమార్, సహాయ కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా ఆర్ యం.రవి తదితరులు ఎన్నికయ్యారు.

హౌస్ హోల్డ్ సర్వేని 15 లోపు పూర్తి చేయాలి

- వేసవిని దృష్టిలో ఉంచుకొని సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు సిద్ధం కండి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-చిత్తూరు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద జిల్లా లో చేపట్టిన ఇండ్ల నిర్మాణంలో భాగంగా వివిధ దశలలో ఉన్న ఇంటి నిర్మాణాల పనులను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుండి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణ పురోగతి, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా సంబంధిత అంశాలపై మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీఓలు, హౌసింగ్ డిఈలు ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన 77,366 ఇండ్లలో 49,321 పూర్తి కావడం జరిగిందని, 2025 జనవరి 1 నుండి మార్చి 31 వరకు 7,311 ఇండ్ల నిర్మాణం పూర్తి లక్ష్యంగా వివిధ మండలాలకు కేటాయించగా ఇందులో

2లో

మరోసారి ఆపన్న హస్తం

- మానవత్వం చాటుకున్న ముఖ్యమంత్రి
- అర్జీదారునికి సీఎం సహాయ నిధి రూ.2 లక్షల చెక్కును అందించిన కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: చిత్తూరు జిల్లా, గంగవరం మండలం, ఉయ్యాల మిట్ట గ్రామం, రత్నప్ప తమ కుమారుడు బాలాజీ పుట్టుకతో విభిన్న ప్రతిభావంతుడని వారి ఆర్థిక పరిస్థితి బాగాలేదని తాము నిరుపేదలమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారావారిపల్లి పర్యటన సందర్భంగా కలవగా ముఖ్యమంత్రి తమ పరిస్థితిని, స్థితిగతులు చూసి చలించి పోయి ఆర్థిక సాయం అందించాల్సిందిగా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం సదరు అర్జీదారుడు కలెక్టర్ కార్యాలయమునకు రాగా వెను వెంటనే 2 లక్షల రూపాయల ఆర్థిక సాయం సీఎం రిలీఫ్ ఫండ్ నుండి బాలాజీ తండ్రి రత్నప్పకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చెక్కును అందచేశారు. తమకు 2 లక్షలు ఆర్థిక సహాయం చేసి ఆదుకుని ఆపన్న హస్తం అందించిన ముఖ్యమంత్రికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని వారు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాండ్ ఇమేజ్ దిశగా ఆంధ్రప్రదేశ్

- పరిశ్రమల స్థాపనకు స్వర్గధామంగా ఏపీ - చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

విశాలాంధ్ర-చిత్తూరు: ఆంధ్ర ప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిస్వర్ణాంధ్ర విజన్ 2047కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ముందుకు సాగుతున్నారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు. రూ.11.73 లక్షల కోట్ల పెట్టుబలను సాధించి ఏపీని పరిశ్రమల స్థాపనకు స్వర్గధామంగా మార్చిన ఘనత ఏపీ సీఎం చంద్రబాబుకే దక్కిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బృందం నాలుగు రోజుల దావోస్ పర్యటన విజయవంతం కావడం పై చిత్తూరు ఎంపీ సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పెట్టుబడులను ఆకర్షించి, రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పి, నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపడంతో పాటుగా, దేశ ఔన్నత్యాన్ని చాటే విధంగా, ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధివైపు అడుగులేయించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఐటీ మంత్రి బృందం పర్యటన దావోస్లో కొనసాగిందని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రముఖ సంస్థల సీఈవోలు-అధిపతులతో, పలు దేశాల ప్రతినిధులతో చర్చలు జరిపిన చంద్రబాబు బృంద మరోవైపు రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సుల్లో విరామం లేకుండా పాల్గొన్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను కార్పొరేట్ దిగ్గజాల్లో బలంగా నాటారని చెప్పారు. వివిధ రంగాలకు చెందిన దాదాపు 15 ప్రపంచ అత్యున్నత వాణిజ్య సంస్థల అధిపతులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టు బడులకు ఉన్న అనుకూలతలను వివరించి వాటిని ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడం గొప్ప విషయం అన్నారు. పేర్కొన్నారు. బిల్‌గేట్స్‌తో భేటీ అయిన సీఎంబిల్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్, డయాగ్నో స్టిక్స్ ప్రారంభించాలని కోరడం.. సియం చంద్రబాబు నాయుడి పాలనాదక్షితకు నిదర్శనం అన్నారు. 2019 నుంచి రాష్ట్రంలో చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఏపీ సీఎం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిలా కాకుండా సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు జవాబుదారీగా పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. 2 లక్షల కోట్ల పెట్టుబడును రాష్ట్రానికి తీసుకొచ్చి, జనవరి 8న పలు ప్రాజెక్టులకు దేశ ప్రధాని నరేంద్ర మోడీచే శంకుస్థాపన చేయించారని గుర్తు చేశారు. ఐదు లక్షల కోట్ల పెట్టుబడులతో ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్న 50 కంపెనీలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని చిత్తూరు ఎంపీ తెలిపారు.

15 లోపు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి) 357 ఇండ్లు పూర్తికాగా. 6,954 ఇండ్లు ఆర్ సి,ఆర్ఎల్ స్థాయిలో ఉన్నాయని వీటిని కంప్లీషన్ స్థాయికి తీసుకొని వచ్చేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ అధికారులు, ఎంపిడిఓలు సమన్వయంతో పనిచేయాలన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లో నమోదు కాని ఇండ్లను నమోదు చేసే ప్రక్రియను ఫిబ్రవరి 15 లోపు పూర్తి చేయాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు వారి పరిధిలో గల తాగునీటి సరఫరా కి సంబంధించి పబ్లిక్ ట్యాప్ లు పనిచేస్తున్నది లేనిది తాగునీటి బోర్లలో ఎటువంటి సమస్యలు ఉన్న వాటి మరమ్మత్తులకు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసే ప్రక్రియను పంచాయతీ సెక్రటరీలు కచ్చితంగా చేపట్టేలా పర్యవేక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా కలుషిత నీరు త్రాగడం ద్వారానే వస్తాయని వీటిని అరికట్టడానికి శుభ్రమైన తాగునీటి సరఫరా ప్రధానమన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఇన్చార్జి పిడి గోపాల్ నాయక్ ఎంపీడీఓలు మున్సిపల్ కమిషనర్లు హౌసింగ్ డిఈ ఏఈ లు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న నేదురుమల్లి

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాలిటీ లోని 20 వార్డులోని మాసాపేట వీధి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు, మాజీ చైర్మన్ సయ్యద్ అబూబకర్ కుమారుడు సయ్యద్ సైఫుద్దీన్ (వైస్సార్సీపీ వెంకటగిరి టౌన్ సోషల్ మీడియా) వివాహ వేడుకలను కాళహస్తిలోని సరోజినీ కళ్యాణమండపంలో ఏర్పాటు చేశారు. ఈ వేడుకలలో పాల్గొని వధూవరులను వైయస్సార్సీపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆశీర్వదించారు.

రఫీఖాన్‌కు ఉత్తమ ఎంపీడీవో పురస్కారం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పఠాన్ రఫీఖాన్ కు ఉత్తమ ఎంపీడీవో పురస్కారం లభించింది. తిరుపతిలో ఆదివారం జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టరు డాక్టర్ వేంకటేశ్వర్ చేతుల మీదుగా ఎంపీడీవో రఫీఖాన్ ఈ పురస్కారం అందుకున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రఫీఖాన్ చేస్తున్న సేవలకు ఈ పురస్కారం లభించింది. ఉత్తమ ఎంపీడీవో పురస్కారం అందుకున్న రఫీఖాన్‌ను పలువురు అభినందించడంతో పాటు శుభాకాంక్షలు తెలియచేశారు.

సాగు భూమికి పట్టాలు ఇవ్వాలి: సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వేదాల శ్రీనివాసపురం గ్రామం రైతులు సాగు చేస్తున్న పొలాలకు పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని సిపిఐ నాయకుడు చిన్ని రాజ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం లో సోమవారం తహసిల్దార్ సుబ్రహ్మణ్యం కు సిపిఐ నాయకుడు చిన్ని రాజ్, కత్తి ధర్మయ్యలు గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చిన్ని రాజ్ మాట్లాడుతూ వి ఎస్ పురం గ్రామంలో సర్వే నెంబర్ 340 లోని లెక్క దాఖలాలు సుమారు 36-60 సెంట్లు భూమి లో 25 ఎకరాలు భూమిని 70 మంది కుటుంబాలు సాగుచేస్తుకుంటున్నారు. సాగు చేసుకుంటున్న భూమిని గ్రామం మొత్తం భూ పంపిణీ చేసి పట్టాలివ్వాలని కోరారు. వీరితోపాటు కృష్ణయ్య, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

అమ్మవారి ఆత్మార్పణదినం వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఈ నెల 31న శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణదిన వేడుకలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డిని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బజారు వీధి నందు గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం సభ్యులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి వేడుకలకు రావాలని ఆహ్వానించారు.

దళితుడిపై హత్యాయత్నం చేస్తే

నిందితులకు శిక్షలు తక్కువ పడేలా కేసులు పెట్టడం సరికాదు

- తిరుపతి జిల్లా ఎస్పీకి దళిత సంఘాల నేతల వినతి

- కేసును పరిశీలించి బాధితుడికి న్యాయం చేస్తాం: తిరుపతి ఎస్పీ హామీ

విశాలాంధ్ర-తిరుపతి రూరల్ : తిరుమలలో చిరు వ్యాపారం చేసుకుని జీవిస్తున్న బి.బాబు పై కొందరు హత్యాయత్నం చేస్తే వారిపై సరైన కేసులు నమోదు చేయకుండా నిందితులు తప్పించుకోవడానికి అనుకూలంగా కేసులు నమోదు చేయడం సరికాదని, బాధితుడికి న్యాయం చేయాలంటూ తిరుపతి జిల్లా ఎస్పీకి ఎస్సీ, ఎస్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు గౌడ పేరు చిట్టిబాబు, వివిధ దళిత సంఘాల నేతలు కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో బి.బాబు భార్య యశోదతో కలిసి వారు ఎస్పీని కలిసి వాస్తవాలను తెలియజేశారు. ఈ సందర్భంగా గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ తిరుమలలో టీటీడీ పద్మావతి గెస్ట్ హౌస్ లో అసిస్టెంట్ షరాబుగా పనిచేస్తున్న కోనిశెట్టి రాము అతని సోదరుడు తిరుమల వైఎస్ఆర్సిపి యువజన విభాగం అధ్యక్షుడు కోనిశెట్టి ప్రవీణ్ అలియాస్ ప్రవీణ్ రాయల్ కలసి బి బాబు మధ్యవర్తిత్వంలో అతని స్నేహితుడు డి సత్యనారాయణ వద్ద 30 లక్షల రూపాయలు తిరుమల లోని సారంగి హోటల్ నిర్వహణకు అప్పుగా తీసుకున్నారని వివరించారు. ఆ డబ్బులు అడిగినందుకు బి బాబును కక్ష కట్టి అంతం చేస్తామని హెచ్చరించారన్నారు. అందులో భాగంగానే ఈనెల 24వ తేదీన కరకంబాడి రోడ్డులోని గోవింద నగర్ ఆర్చి వద్ద ముగ్గురు వ్యక్తులు ఇనుప రాడ్లతో దాడి చేశారన్నారు. ఏకంగా బి బాబును చంపడానికి ప్రయత్నిస్తే వారిపై శిక్ష తక్కువ పడేలా అలిపిరి పోలీసులు కేసులు నమోదు చేశారని ఆయన ఎస్పీకి వివరించారు. లీడ్ క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ చైర్మన్ పి సుబ్బయ్య మాట్లాడుతూ దళితుడైన బి బాబు పై ఒక పథకం ప్రకారం హత్యాయత్నం జరిగిందన్నారు. అతనిపై ఇనుప రాడ్లతో దాడి చేస్తే వారిపై హత్యాయత్నం కింద కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహాజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరాటపు సుధాకర్ బాబు, బాబు జగ్జీవన్ రామ్ భవన కమిటీ కార్యదర్శి కే.మధు, ఉపాధ్యక్షుడు మాసారపు గోపి, మాదిగ వీరుల సంఘం జిల్లా అధ్యక్షుడు మునిరాజా, ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు గోపి, జీవకోన అంబేద్కర్ భవన్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళయ్య, ఎస్సీ ఎస్టీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయన రమేష్, పుదీపట్ల రాజు, మాదిగ సంక్షేమ సంఘం రామచంద్రపురం నాయకుడు రవి తదితరులు పాల్గొన్నారు.

డిఎస్పిని సన్మానించిన ముస్లిం జెసి చైర్మన్

విశాలాంధ్ర-పలమనేరు: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పలమనేరు డి.ఎస్.పి డేగల ప్రభాకర్‌కు ఉత్తమ ప్రశంస పత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ముస్లిం జేఏసీ చైర్మన్ కె ఎస్ ముర్తుజా సోమవారం డిఎస్పిని కలిసి శాలువా కప్పి పుష్ప గుచ్ఛంతో సన్మానించారు. ఇంకా తమ వృత్తిలో మరిన్ని సేవలు అందించి మరెన్నో అవార్డులను అందుకోవాలని ఆకాంక్షించారు.

వైఎస్సార్సీపీలోనే పంచాయతీల అభివృద్ధి

విశాలాంధ్ర-కార్వేటినగరం: వైఎస్సార్సీపీ ప్రభుత్వంలోనే పంచాయతీలు అభివృద్ధి పథంలో దూసుకు పోయిందని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. సోమవారం పంచాయతీ పరిధిలోని పద్మసరస్సు ఉన్న గొల్లఇండ్లు వద్ద జేజేఎం పథకం ద్వారా రూ.20.90 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంకును ఎంపీటీసీ లక్ష్మమ్మతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ఒక్క మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనెడ్డి ప్రభుత్వంలోనే సాధ్యమైందని, కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఒక్క పథకాన్ని అమలు చేసిన పాపాన పోలేదన్నారు. మేజర్ పంచాయతీలో రూ.కోటి 25 లక్షలతో ట్యాంకు నిర్మాణం చేపట్టి ప్రజలకు తాగునీటి సమస్యకు స్వస్తి పలకడం జరిగిందన్నారు. మేజర్ పంచాయతీని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి దత్తతకు తీసుకుని ఎక్కడ లేని విధంగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధి ఒక్కు మాజీ సీఎం జగన్మోహనెడ్డితో సాధ్యమవుతుందని నిరూపించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు వెంకటేష్, గురుమూర్తి, మహిళలు పలువురు పాల్గొన్నారు.

పోకల చెంగల్రాయుడుకి ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర-సోమల: సోమల మండలం గట్టువారిపల్లి కి చెందిన హెడ్ కానిస్టేబుల్ పోకల చెంగల్రాయుడు కి 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవ పురస్కారం లభించింది. విధి నిర్వహణలో సమర్థవంతం గా విధులు నిర్వర్తించినందుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వారి చేతుల మీదుగా అవార్డు ను అందుకున్నారు. రైతు కుటుంబం లో జన్మించి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనే ధ్యేయం తో పోలీస్ ఉద్యోగం సంపాదించి తల్లితండ్రులు కోరిక ను నెరవేర్చారు. అలాగే ప్రజలకు తనవంతు సహాయం చేస్తూ ముందుకు సాగారు. తనకు ప్రభుత్వం నుంచి అవార్డు వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేసారు.అలాగే మరింత భాధ్యతలు పెరిగాయని తెలియజేసారు.

ఆహా.. ఏమీ సౌందర్య నైపుణ్యం

వాయులింగేశ్వరుడు చాలా పవర్ ఫుల్

రష్యా భక్తులతో ఎమ్మెల్యే బొజ్జల మాటామంతి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆహా.. ఏమీ సౌందర్య నైపుణ్యం.. అత్యద్భుతంగా మలచిన రాతి కళాఖండాలు.. ఎటు చూసినా ఆధ్యాత్మికత ఉట్టిపడే ఈ ఆలయ సందర్శన తమను ఎంతగానో ఆకట్టుకుంది. వాయులింగేశ్వరుడు చాలా పవర్ ఫుల్.. శివమూర్తిని చూడగానే ఆ వైబ్రేషన్స్ తో తన్మయం చెందామంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డితో రష్యా భక్తులు తమ అనుభవాలను పంచుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం రష్యా దంపతులు సోమవారం ఇక్కడకు విచ్చేశారు. స్వామి వారి దర్శనానంతరం సూక్ష్మ నంది వద్ద కూర్చొని పసిడి ధ్వజస్తంభ అందాలను తిలకిస్తుండగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన చేస్తూ వచ్చిన ఎమ్మెల్యే కంట ఈ విదేశీ భక్తులు పడ్డారు. వారిని పలకరించి మెట్లపై కూర్చొని సంభాషించారు. ఈ సందర్భంగా వారు ఆలయ సందర్శనలో తమ అనుభూతులను పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విదేశీ భక్తుల స్పందన అపురూపమని తెలిపారు. ఇకపై ఆలయానికి వచ్చే విదేశీ భక్తులకు ప్రత్యేక ఆశీర్వాద దర్శనంతోపాటు తీర్థప్రసాదాలను అందిస్తామని చెప్పారు. ఆలయ ప్రాశస్త్యంతోపాటు శిల్ప కళా విషయాలను వచ్చే విదేశీ భక్తులకు వివరించడానికి ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. తద్వారా శ్రీకాళహస్తీశ్వరాలయ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసి మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

తిరుమలలో రథసప్తమి ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర-తిరుపతి: తిరుమలలో ఫిబ్రవరి 4వ తేదీ జరగబోవు రథసప్తమి భద్రత పై నాలుగు మాడ వీధులు మరియు గ్యాలరీలు పార్కింగ్ ప్రదేశాల్లో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా తిరుమలకు వచ్చే భక్తులు రద్దీని దృష్టిలో ఉంచుకొని, వాహన మండపము, నాలుగు మాడ వీధులు, గ్యాలరీలు, పార్కింగ్ ప్రదేశాలు మరియు ఎంట్రీ అండ్ ఎగ్జిట్ పరిశీలించడం జరిగింది. భద్రతాపరంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా, ముఖ్యంగా తిరుమల నందు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా సూచించారు. తిరుమలకు వచ్చే భక్తులకు భద్రత కల్పించాలని ఆదేశించారు. తిరుమలలో రథసప్తమి ఏర్పాట్లకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. తిరుమలలో రథసప్తమి అయ్యేంత వరకు సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జే.వెంకట్రావు అదనపు ఎస్పీ పరిపాలన, రామకృష్ణ అదనపు ఎస్పి తిరుమల, వి.గిరిధర్ ఎస్‌డిఎస్‌పి, తిరుమల డీఎస్పీలు మరియు సీఐలు పాల్గొన్నారు.

పవిత్ర ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

-డీయస్పీ నరసింహమూర్తి



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పవిత్ర ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి డీయస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు సోమవారం శ్రీకాళహస్తి పట్టణం నీలకంఠేశ్వరస్వామి ఆలయ పరిసరాలను ఆయన తన సిబ్బందితో కలసి పరిశీలించారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో బహిరంగ ప్రదేశంలో మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించారు. పురపాలక సంఘం పారిశుధ్య కార్మికుల సహాయంతో ఆ పరిసరాలను శుభ్రం చేయించారు. అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీయస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ... నిషేధిత ప్రాంతాల్లో మద్యం సేవించకూడదన్నారు.ఈ నిబంధన ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ డి.గోపి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- గూడూరు డిఎస్పీ గీత

విశాలాంధ్ర-గూడూరు: క్రీడలలో రాణించడం ద్వారా శారీరక దృఢత్వం పెంపొందించుకోవడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవచ్చని గూడూరు డిఎస్పీ గీత తెలిపారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో నిర్వహించిన యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ గూడూరు డిఎస్పి గీత ప్రారంభించారు. క్రీడలు, వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థినిలను గూడూరు డిఎస్పి గీత అభినందిస్తూ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు డిఎస్పి గీత మాట్లాడుతూ అనేక క్రీడలలో మహిళలు రాణించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థినిలు చదువులతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవడం చాలా అవసరమని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడంతోపాటు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినీలు, కూడా తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ మహల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి రెడ్డివారిపల్లి సమీపంలో ఈద్గా వద్ద నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ మహల్ ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముస్లిం మత పెద్దలతో కలిసి పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ పరిశీలించడానికి వచ్చిన ఆయనకు ముస్లిం మత పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఈ కమ్యూనిటీ మహల్‌ను 1 కోటి 60 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. అంతేకాకుండా ఈద్గా స్థలంలో డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని మత పెద్దలు ఎమ్మెల్యేలు కోరడంతో తక్షణమే తుడా అధికారంతో మాట్లాడి డైనింగ్ హాల్‌కు కావలసిన ప్రతిపాదనను సిద్ధం చేసి త్వరలోనే అమలు పరచాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే చేసిన సహాయానికి మత పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీగాయత్రిలో ఘనంగా క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ కు విద్యార్థులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వారు క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వం కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం వారి చేతుల మీదుగా క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, పిఈటి చైతన్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు నివారించాలి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మోనిటరింగ్ ఎవల్యూషనరీ అధికారి ధనలక్ష్మికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆ సంఘ నాయకత్వం అందించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేక దళిత గిరిజన కాలనీలలో ఇళ్ళకు తాళాలు వేసి కుటుంబాల కుటుంబాలుగా పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారని వలసలు నివారించకపోతే గ్రామాలన్నీ కూడా సందడి లేకుండా నిర్మానుషంగా మారే ప్రమాదం ఉందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని జాబు కార్డు లేని కూలీలకు జాబు కార్డు లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేసిన కూలీలకు వేతనాలు చెల్లించకుండా పెండింగ్ బకాయిలు ఉన్నాయని వాటిని కూడా తక్షణమే విడుదల చేసి కూలీలకు వేతనాలు ఇవ్వాలని అదేవిధంగా రోజు కూలి కింద 700 రూపాయలు చెల్లించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని తెలిపారు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంతో ప్రతిష్టాత్మకంగా వాము పక్ష పార్టీల పోరాట ఫలితంగా ఏర్పడిందని ఈ యొక్క ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారు పద్ధతులలో వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సరైన సూచనలు చేయకుండా నిర్లక్ష్యంగా ఉండడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఉపాధి హామీ పనులలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బందికి తగిన భద్రత కల్పించి వారికి సరైన వేతనాలు ఇవ్వాలని గత ప్రభుత్వంలో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందిపై ఎలాంటి ఖర్చు సాధింప చర్యలకు పాల్పడకూడదని కూడా ఆయన డిమాండ్ చేశారు. అధికారి ధనలక్ష్మి స్పందిస్తూ తెలియజేసిన సమస్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.తులసి రాజన్, జిల్లా నాయకులు చిన్నం పెంచలయ్య, మహేష్, జీ.శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో పొదుపును అలవాటు చేయాలి

విశాలాంధ్ర-తిరుపతి: పిల్లల్లో బాల్యం నుండే పొదుపును అలవాటు చేయడం ద్వారా భావిత రాలకు భరోసాను ఇస్తుం దని ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు మరియు ఎస్టియు రాష్ట్ర నేత గాజుల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఎస్వియు క్యాంపస్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులు తమ ఇల్లు, పాఠశాల,మరియు పరిసరాల్లో కుళాయిల్లో వృథాగా పోతున్న నీటిని, అవసరం లేని చోట వెలుగుతున్న విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయడం ఇంధన పొదుపుకై సైకిల్ వాడడం, ఆహారాన్ని వృధా చేయకుండా ఉండటం, కిడ్డీ బ్యాంకు ద్వారా డబ్బులు పొదుపు చేయడంవంటి అంశాలను అలవాటు చేసుకోవడం ద్వారా పొదుపును బాల్యం నుండే పాటించి భవిష్యత్తు కు దేశ సంపదను కాపాడినట్లేనన్నారు. పాఠశాలలో పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమను, మొక్కల పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న ప్రధాన ఉపాధ్యాయుడు మురళీకృష్ణ, ఉపాధ్యాయురాలు సరిత లను అభినందించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మునికృష్ణమ నాయుడు, సి.వాసు లు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు ను ఘనంగా సన్మానించారు.

నేడు తిరుపతిలో ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ర్యాలీ

జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: నేడు మంగళవారం ఉదయం 10 గంటలకు ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్ ర్యాలీ కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ మెయిన్ గేట్ నుండి అలిపిరి గరుడ సర్కిల్ వరకు తిరుపతి నగరంలోని నిర్వహించబడు తుందని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని షో రూముల డీలర్ సిబ్బంది సహాయ సహకారాలతో నిర్వహించ బడుతుందని, హెల్మెట్ గురించి అవగాహన కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమాన్ని 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవ సందర్భంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. రహదారి భద్రతపై ఔత్సాహికులు హెల్మెట్ ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ ఆ ప్రకటనలో తెలియజేశారు.

ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ఫీజుల బకాయిలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క విద్యార్థికి హాల్ టికెట్లు ఇవ్వాలి

- ఒక పేరుతో అనుమతి తీసుకొని ఇంకో పేరుతో విద్యాసంస్థలను నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలు సీజ్ చేయాలి

- ఏఐఎస్ఎఫ్ -పిడిఎస్‌యు డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ఫీజుల దోపిడీ అరికట్టాలని, ఫీజు బకాయిలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క విద్యార్థికి హాల్ టికెట్లు ఇవ్వాలని, విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీని నియమించి విచారణ చేపట్టాలని అలాగే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్నటువంటి కళాశాలల మీద క్రిమినల్ కేసులు బనాయించి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా డిఆర్‌ఓకి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి మాట్లాడుతూ ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నారాయణ శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, అధిక మొత్తంలో ఫీజుల దోపిడీ చేస్తూ విద్యార్థుల ప్రాణాలు పోతున్న తమకు సంబంధం లేదు... ఫీజులు మాత్రమే ముఖ్యమనే రీతిలో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించకపోతే తరగతులకు అనుమతించమని బోర్డు పరీక్షలు రాయటానికి హాల్ టికెట్స్ ఇవ్వమని విద్యార్థులు బెదిరించి వారిని మానసికంగా హింసించడం వల్లే అనంతపురం జిల్లాలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి ఇటీవల భవనం పైకి ఎక్కి దూకి మృతి చెందాడు అన్నారు. విద్యార్థి మరణానికి కారణమైన నారాయణ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున విద్యార్థుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీని నియమించి విచారణ చేపట్టాలని అలాగే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న కళాశాలల మీద క్రిమినల్ కేసులు బనాయించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు జాకీర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ హరికృష్ణ, చంద్ర నాయక్, ఓం రాజ్ తదితరులు పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాల కల్పనే ముఖ్యమంత్రి లక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనలో ఏపీకి కొత్త శకం

విశాలాంధ్ర - చంద్రగిరి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనతో ఏపికి కొత్త శకం ప్రారంభమైందని 20 లక్షల ఉద్యోగాలు కల్పనే ఆయన లక్ష్యమని చంద్రగిరి ఎంఎల్ఏ పులి వర్తి నాని అన్నారు. మండలంలో ఓ అభివృద్ధి కార్యక్రమానికి హాజరైన నాని మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఏపీ పారిశ్రామిక రంగం తిరిగి జీవం పోసుకుందన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా ప్రపంచ దిగ్గజాలతో ముఖ్యమంత్రి భేటీ అయి రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షించారని ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్) రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో చర్చలు జరిపారని తెలిపారు. తెలుగువాడి కీర్తిని మరోసారి ప్రపంచానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాటి చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో దావోస్‌లో కష్టపడి పనిచేశారు. వెళ్లిన ప్రతి చోట చంద్రబాబు మరియు లోకేష్‌కు పారిశ్రామికవేత్తలు ఘన స్వాగతం పలికారు. ఏపీలోని అపార వనరులు, మౌలిక సదుపాయాలు గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ వివరించారు. భేటీ అయిన ప్రతి పారిశ్రామికవేత్త తమ ఎగ్జిక్యూటివ్ మెంబర్లతో చర్చించి ఏపీలో పెట్టుబడులు పెడతామని హామీ ఇచ్చారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, టాటా చైర్మన్ చంద్రశేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలు చంద్రబాబు విజన్‌ను మెచ్చుకున్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ. 5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయి. ఇప్పటికే అనేక కంపెనీలు తమ కార్యకలాపాలు మొదలుపెట్టాయి. యువతకు 40 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఏపీ పారిశ్రామిక రంగానికి జీవం పోశారు. దావోస్ పర్యటనతో మన రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. యువగళం పాత్రయాత్ర ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తి అయ్యింది. పాదయాత్రలో భాగంగా 100 కిలోమీటర్లకు పూర్తికాగానే శిలాఫలకం ఏర్పాటు చేయడం జరిగిందని అందులో భాగంగా పాకాల మండలం, లేపకుంటలో త్వరలోనే 10 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే గొప్ప నాయకుల నేతృత్వంలో ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే అదృష్టం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ మీడియా సమావేశంలో చంద్రగిరి, తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు, ఈశ్వర్ రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గౌస్ బాషా, జెడ్పీటీసీ మాజీ సభ్యులు వీరంగారి రమేష్ రెడ్డి, జనసేన నాయకులు తపసి మురళి రెడ్డి, ఉమ్మడి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు డ్రగ్ ఇన్స్పెక్టర్‌కు అవార్డు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి డివిజన్ డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రశాంతికి రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ సేవలకు గాను విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. ఆదివారం తిరుపతిలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్. వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు మందుల షాపుల యజమానులు అభినందించారు.

స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండలం లోని మద్దినాయన పల్లిలో సోమవారం సిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. దామల చెరువు పిహెచ్‌సి పరిధిలోని మద్ది నాయనిపల్లి సచివాలయం వద్ద సిమ్స్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు స్థానిక సర్పంచ్ గిరిధర్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు,మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.మహిళలు,పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో దామలచెరువు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవిరామ్,స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత,సర్పంచ్ కె.గిరిధర్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళి, ఎంఎల్‌హెచ్‌పి జి.మీనా,ఏఎన్ఎం లావణ్య స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలను త్వరగా పరిష్కరించాలి:జెసి

విశాలాంధ్ర -చిత్తూరు: పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, చిత్తూరు ఆర్ డి ఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులు పని చేయాలని, ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, ఆర్ డి ఓ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు

పరీక్షలు దూరవిద్య పరీక్షలు యధావిధిగా కొనసాగిస్తూ

పగడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : దూరవిద్య పరీక్షలు గతంలో మాదిరిగా యధావిధిగా కొనసాగిస్తూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ క్యాంపస్ అధ్యక్షులు రంజిత్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న ఎన్ఎస్యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు, జీఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు శివశంకర్ నాయక్ లు మాట్లాడుతూ ఫిబ్రవరి 3వ తేదీ నుండి దూరవిద్య పరీక్షలు దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 32 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నప్పటికీ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని వారు తెలిపారు పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అదేవిధంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని దూరవిద్య పరీక్షలు మూడో తేదీన పకడ్బందీగా నిర్వహించాలని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బిసన్న, రాజు, గంగాధర్, వేణు, వంశీ, తదితరులు పాల్గొన్నారు

ఏపీలో పెట్టు బడులపై వైకాపా నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా :టిడిపి నేతల సవాల్

విశాలాంధ్ర -చిత్తూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేష్ దావూస్ పర్యటనపై వైకాపా నాయకులు విమర్శించడం సిగ్గుచేటని టిడిపి జిల్లా అధ్యక్షులు సి ఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చూడ చైర్ పర్సన్ కటారి హేమలత, టిడిపి నేతలు కోదండ యాదవ్ సురేంద్ర కుమార్‌లు తెలిపారు. సోమవారం చిత్తూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి థామస్ పర్యటనలో భాగంగా అనేక ప్రముఖ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి తమ అంగీకారాన్ని తెలిపాయని చెప్పారు. ఈ విషయంగా వైకాపా నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ విలేకరులసమావేశంలోటిడిపినేతలు చంద్ర ప్రకాష్,మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

తిరుచానూరు ఆలయ పరిసరాల్లో ఈవో తనిఖీలు

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని టిటిడి ఈవో జె.శ్యామల రావు ఆలయ అధికారులను ఆదేశించారు. టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, టిటిడి అధికారులతో కలిసి ఆయన సోమవారం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ టిటిడి విజన్ లో భాగంగా తిరుచానూరు ఆలయం పరిసరాలలో భక్తులలో మరింత భక్తిభావం, ఆహ్లాదాన్ని పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా తోళప్ప గార్డెన్ ను ఈవో పరిశీలించారు. తోళప్ప గార్డెన్‌లోని కళ్యాణ మండపాలను ఎప్పుడు నిర్మించారు, సౌకర్యాలు ఎలా ఉన్నాయి, కళ్యాణ మండపాలలో తాజా పరిస్థితులు, తదితర అంశాలపై ఇంజనీరింగ్ అధికారులతో ఈవో మాట్లాడి తెలుసుకున్నారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో పరిమిత స్థలంలోనే టికెట్ల జారీ, లడ్డూ కౌంటర్లు ఉండడం మూలంగా భక్తులకు చాలా ఇరుకుగా ఉండడం వల్ల భక్తులకు అసౌకర్యంగా ఉంటోందన్నారు. ఆలయ సమీపంలోని టిటిడి స్థలాన్ని, నాలుగు మాడ వీధుల్లో అధికారులతో కలిసి తిరిగారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సిఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, టౌన్ ప్లానింగ్ ప్రత్యేక అధికారి రాముడు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ టోర్నమెంట్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న దండు లక్ష్మి సిరి

విశాలాంధ్ర- గూడూరు: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ (ఐట) ఉమెన్స్ 2.5 లక్షల టోర్నమెంట్ కొచ్చి లో ఈనెల 20 తేదీ నుండి 25వ తేదీ వరకు జరిగింది . గూడూరు పట్టణానికి చెందిన దండు లక్ష్మి సిరి టోర్నమెంట్లో రన్నర్ గా నిలిచింది. ఈనెల 20వ తేదీ సోమవారం మొదటి రౌండ్ దాసరిశ్రీ తన్వి కర్ణాటక మీద 7-5-6-0 గెలిచింది. అదేవిధంగా మంగళవారం రెండవ రౌండ్ విధుల అమర్ కర్ణాటకపై 6-2-6-2పై వరుస సెట్లలో విజయం సాధించింది. అదేవిధంగా మూడవ రౌండ్ క్వార్టర్ ఫైనల్ లో కర్ణాటక కు చెందిన హ్రిదే షి పాయ్ పై 7-5-6-2 వరుస సెట్లలో గెలిచి సెమీఫైనల్ చేరుకుంది. గురువారం సెమీఫైనల్ లో మహారాష్ట్ర చెందిన సోనాల్ పాటిల్(సీడ్2) పై 6-2-6-1 పై గెలిచి ఫైనల్స్ కు చేరింది . శనివారం నిర్వహించిన ఫైనల్స్ లో మహారాష్ట్రకు చెందిన పూజ ఇంగలె (సీడ్1) తో పోటీ పడి4-6-1-6 ఓటమి చెందింది. దీంతో ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఉమెన్స్ 2.5 లాక్స్ టోర్నమెంట్లో గూడూరు చెందిన దండు లక్ష్మి సిరి రన్నర్ గా నిలిచింది. దీంతో కేరళ ,కొచ్చి వాసులు అభినందనలు తెలిపారు.ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్లో గూడూరు చెందిన లక్ష్మీ సిరి తృటిలో ప్రథమ స్థానాన్ని కోల్పోయి, ద్వితీయ స్థానం సాధించడం దేశానికే తలమానకమని పలు వురు పేర్కొన్నారు. ప్రతి నెలలో ఏదో ఒక టోర్నమెంట్లో విజ యం సాధిస్తూ గూడూరు పేరును దేశంలోనే నిలుపుతుంది. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని పలువురు తమ అభిప్రా యాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈమె ఆల్ ఇండియా ఉమెన్స్ క్యాటగిరీలో 30, జూనియర్ అండర్ -18 లో ఇండియా నెంబర్ 4 ర్యాంకులో కొనసాగుతుంది. అతి చిన్న వయసులో ఇటువంటి విజయాలను కైవసం చేసు కుంటూ గూడూరుకే వన్నె తెస్తుందని పలువురు టెన్నిస్ క్రీడాకా రులు ఆకాంక్షించారు. డెహ్రాడూన్ లో ఫిబ్రవరి 5 నుండి 11 వరకు జరిగే నేషనల్ గేమ్స్ లో తెలంగాణ రాష్ట్రం తరపున టెన్నిస్ క్రీడా తరపున ఆడనుంది.

ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

కమిషనర్ పి నరసింహ ప్రసాద్

విశాలాంధ్ర -చిత్తూరు : సొంత ఇంటి స్థలం కలిగి ఉండి ప్రభుత్వ సబ్సిడీతో సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని చిత్తూర్ నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద సొంత ఇంటి స్థలం కలిగి ఉండి ప్రభుత్వం మంజూరు చేసే సబ్సిడీ ద్వారా ఇల్లు నిర్మించుకోవచ్చని, ఇందుకోసం ప్రభుత్వం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రూ.2.50 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఇంటి నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులు నగరపాలక పరిధిలోని సంబంధిత వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు వార్డు పరిధిలోని అమినిటీ కార్యదర్శిని కలిసి వివరాలు పొందవచ్చని తెలిపారు.

బాలుకు విశిష్ట ప్రశంసా పత్రం

విశాలాంధ్ర–తొట్టంబేడు: తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న కయ్యూరు బాలుసుబ్రహ్మణ్యం అంతర్జాల వేదికగా విశిష్ట అభినందన ప్రశంసాపత్రం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఆదరణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన స్వేచ్ఛా స్వాతంత్ర్యం అంశంపై నిర్వహించిన కవితలపోటీల్లో చక్కటి దేశ భక్తి కవితను పంపినందుకు గాను ఈయనకు ఈ విశిష్ట ప్రశంసా పత్రం పంపినట్లు ఆదరణ సంస్థ ఫౌండర్ గొట్టుముక్కల చెన్న కేశవులు తెలియచేసారు. ఈ ప్రశంసా పత్రం రావడం పట్ల బాలును పలువురు అభినందించారు.

శ్రీసిటీలో 'ఎన్ఎక్స్ లాజిస్టిక్స్' విస్తరణ

విశాలాంధ్ర–సత్యవేడు: జపాన్‌కు చెందిన నిప్పాన్ ఎక్స్‌ప్రెస్ కంపెనీ లిమిటెడ్ అను బంధ సంస్థ ఎన్ఎక్స్ లాజిస్టిక్స్ ఇండియా, శ్రీసిటీలోని తన అధునాతన లాజిస్టిక్స్ సదుపాయాన్ని సోమవారం విస్తరించింది. ఈ సందర్భంగా విచ్చేసిన చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మునేయో తకాహాషి, నిప్పాన్ ఎక్స్‌ప్రెస్ హోల్డింగ్స్ చీఫ్ మేనేజింగ్ ఆఫీసర్ ఫురో తడాహిరో లకు శ్రీసిటీ తరపున మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విస్తరణ ఎన్ఎక్స్ లాజిస్టిక్స్ ఇండియా మరింత నాణ్యమైన లాజిస్టిక్స్ సేవలను అందించడానికి దోహదపడుతుంది.

ప్రముఖ హృద్రోగ శస్త్ర చికిత్సా నిపుణులు

చెరియన్ మృతికి శ్రీసిటీ ఎండీ నివాళులు

విశాలాంధ్ర–సత్యవేడు: దేశంలో మొట్ట మొదటి విజయవంతమైన కొరోనరీ ఆర్టరీ బైపాస్, గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేసిన ప్రముఖ హృద్రోగ వైద్యులు కెఎం చెరియన్ మృతి పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.డాక్టర్ చెరియన్ సేవాతత్వం, అంకిత భావాన్ని అందరూ స్మరించుకుందాం అన్నారు. చెరియన్ మార్గదర్శకత్వంలో ఏర్పాటైన శ్రీసిటీ హెల్త్ సెంటర్ ఈ ప్రాంతంలోని పేదలకు నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించిందన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.డాక్టర్ చెరియన్ నిబద్ధతను కొనియాడుతూ, శ్రీసిటీలో 2009 లో ప్రారంభమైన ఫ్రాంటియర్ లైఫ్‌లైన్ హాస్పిటల్ 9 సంవత్సరాలకు పైగా మంచి వైద్య సేవలను అందించిందన్నారు. ఆ సమయంలో ఈ ప్రాంత ప్రజలు, పాఠశాల విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా అనేక ఆరోగ్య వైద్య శిబిరాలను నిర్వహించారని పేర్కొన్నారు.

మమ్ములను గుర్తించి ఆదుకోవాలి

- సంచార జాతి సంఘం నేతల వినతి

విశాలాంధ్ర - రామకుప్పం : మండల పరిధిలో జీవితాలు నెట్టుకొస్తున్న అత్యంత వెనుకబడిన 32 సంచార జాతి కి చెందిన కులాల వారిని గుర్తించి ఆదుకోవాలని సంచార జాతి సంఘం అధ్యక్షుడు చలపతి ఆధ్వర్యంలో సుబ్రమణ్యం, నాగరాజు, తదితరులు తహశీల్దార్ బాబు మరియు ఇంచార్జి ఎంపీడీవో మురళీధర్ రెడ్డి లకు తాము ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంచార జాతుల వారికి ప్రవేశపెడుతున్న పథకాలను ఇతర మౌలిక వసతులతో పాటు లబ్ధి చేకూరేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ఇళ్ళు లేని వారికి ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేయాలని అందులో కోరామని అధికారులు సానుకూలంగా స్పందించడం జరిగిందని తెలిపారు కార్యక్రమంలో మిరపకాయ శివశంకర్, రమేష్, రాజప్ప, రవి, వెంకటేష్, నటరాజ్ , బయ్యప్ప, మధు, తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారస్తుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటియుసి

ఘనంగా 4వ వీధి వ్యాపారుల సంఘం మహాసభలు

విశాలాంధ్ర–తిరుపతి: ఏఐటియుసికి అనుబంధంగా ఉన్న వీధి వ్యాపార కార్మిక ఫెడరేషన్ తిరుపతి నగర 4 వ మహాసభలు నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్ నందు జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్యఅతిథులుగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణ జిల్లా అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి లు మాట్లాడుతూ వీధి వర్తక వ్యాపారస్తులపై కూటమినేతల దౌర్జన్యాలు దుర్మార్గాలు చాలా ఎక్కువ అయిపోతున్నాయని ఫుట్పాతుల మీద వ్యాపారం చేసుకుంటున్నా వారి దగ్గర నుండి దంతాలు వసూలు చేస్తున్నారని వీటిని అరికట్టడంలో తిరుపతి శాసనసభ్యులు మున్సిపల్ కమిషనర్లు విఫలమయ్యారని వారు ఆరోపించారు.2014 వీధి వర్తక వ్యాపార చట్టం భారత పార్లమెంటులో ఆమోదించబడిన చట్టాన్ని అమలు చేయవలసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కూటమి నేతల ఒత్తిడితో అధికారులు ప్రధాన కూడలిలో బలవంతంగా ఎత్తించే ప్రయత్నం చేస్తున్నారని తరువాత నాయకులు చెప్పారని. ఊరకుంది పోవడం జరుగుతుందని ఈ మధ్యలో కూటమి నేతల దందాలు రోజురోజుకి ఎక్కువైపోతున్నాయని. వీధి వర్తక వ్యాపారులకు అండగా చట్టం ఉన్నప్పటికీ చట్టాన్ని అమలు చేయవలసిన అధికారులు గుర్తింపు కార్డులను రెన్యువల్ చేయలేదని. బ్యాంక్ వడ్డీ లేని రుణాలు ఇప్పించాలని. అలాగే నైట్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని. నూతన సమితిని ఏర్పాటు చేయడం జరిగింది. తదనంతరం ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి వీధి వర్తక వ్యాపార కార్మిక ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివకుమార్ ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్ డి రవి సిపిఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్ లు మాట్లాడుతూ వీధి వ్యాపారస్తులకు అండగా ఎర్రజెండా ఏఐటియుసి ఉంటుందని ఏ ఒక్క వ్యాపారస్తులు జోలికి వెళ్లిన పోలీస్ అధికారులు ట్రాఫిక్ అధికారులు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెళ్లి దౌర్జన్యం చేసిన ఏఐటీయూసీ చూస్తూ ఊరుకోదు అని వ్యాపారస్తులకు అండగా పెద్ద ఎత్తున పోరాటాలకు సన్నద్ధం కావాల్సి వస్తుంది అని కోచమి నాయకుల దందాలు పై తిరుపతి శాసనసభ్యులు కోచమీ ఆశయాలు కనుగుణంగా వీధి వర్తక వ్యాపారస్తులకు అండగా తిరుపతి శాసన సభ్యులు నిలబడాలని లేనిపక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టిన గనే ఓటమి కూటమి నాయకులు కూడా పడుతుంది అని వారు హెచ్చరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, బాలాజీ, సుధాకర్, సరితమ్మ, శ్యాం కుమార్, కాంచనమ్మ, విజయ్ కుమార్, రమేష్, పెంచలమ్మ, అహ్మద్ భాషా, రూప పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీకారం

విశాలాంధ్ర–చంద్రగిరి: విజయనగర్ కాలనీ ఏర్పడి సుమారు 25 సంవత్సరాలు పూర్తి కావస్తుంది. కనీస వసతులు నీళ్లు, కాలువలు, వీధి దీపాలు లేకపోవడంతో పది రకాలుగా ఇబ్బందులు పడినట్లు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాలనీవాసులు ఎమ్మెల్యేకు సమస్యలను వివరించారు. సమస్యలపై స్పందించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రెండు కోట్లకు పైచిలుకు వ్యయంతో అండర్ డ్రైనేజ్ పనులు సోమవారం ప్రారంభించారు. అధికారులకు 45 రోజులలో అండర్ డ్రైనేజ్ పనులు పూర్తి కావాలని వర్షాలు పడితే కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని త్వరితగతిన కాలువ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. చుట్టుపక్కల స్థానికులు పలు సమస్యలతో కూడిన అర్జీలను ఎమ్మెల్యేకు అందించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే ప్రతి సమస్య పరిష్కరిస్తానని మాట ఇచ్చారు. ఈద్గా వద్ద నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే పరిశీలించారు. ఈద్గా వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే నానికి ముస్లిం నాయకులు వారి పద్ధతులతో సాదరంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పనులను పరిశీలించి నిధుల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు కలిసి మెలిసి పనిచేసుకోవాలనిఅభివృద్ధికి ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.

కొండలచెరువులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

విశాలాంధ్ర -పుత్తూరు: స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం నారాయణవనం పిహెచ్‌సి పరిధిలోని కొండలచెరువు సచివాల యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. పింక్ బస్సుల్లో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో నారాయణవనం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాగసుధ, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య భాను, సర్పంచ్ వి.పయని రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మునివాసులు, ఎంఎల్ హెచ్ పి లోకేశ్వరి, ఏఎన్ఎంలు లక్ష్మీదేవి, రాధిక, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఎలక్ట్రిషియన్ డే

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండలంలో జాతీయ ఎలక్ట్రిషన్ డే వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎలక్ట్రిషన్ బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిసన్, విద్యుత్‌ను కనుగొన్న మైఖేల్ ఫారడే అని ఈ సందర్భంగా ఈరోజు జాతీయ ఎలక్ట్రిషన్ డే జరుపుకుంటారని పేర్కొన్నారు. జాతీయ ఎలక్ట్రిషన్ డే సందర్భంగా పాకాల ఆర్టీసీ బస్టాండ్ నుండి చిత్తూరు రోడ్డు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ఎలక్ట్రిషన్ ఎంతో అవసరం అని .ఎలక్ట్రిషన్, విద్యుత్ సిబ్బందికి పనిముట్లు ఇచ్చి,ప్రభుత్వం ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గంగాధరం, బాలాజీ,భాస్కర్,లోకనాథసింగ్, షబ్బీర్ పాల్గొన్నారు.

యువ గళంతోనే టీడీపీ విజయం

విశాలాంధ్ర–గూడూరు: యువ గళం కార్యక్రమం ద్వారా 226 రోజులపాటు 4,000 కిలోమీటర్లు 97 నియోజకవర్గాల మీదుగా పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకొని నేడు రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ తెలిపారు. నారా లోకేష్ బాబు చేపట్టిన యువ గళం పాదయాత్ర ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా లోకేష్ బాబుకు అభినందనలు తెలుపుతూ గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ మాట్లాడుతూ నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర రాష్ట్ర పరిధిలో 97 నియోజకవర్గాల్లో నిర్వహించగా వాటిలో 90 నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించిందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు శ్రీనివా సులు గూడూరు మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు రాజు జిల్లా అధికార ప్రతినిధి చెంచురామయ్య మరియు టిడిపి ముఖ్య నాయకులు శివకుమార్, రహీం, ఇబ్రాయిల్, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో మరణించిన జనసేన సభ్యులకు
రూ.5 లక్షలు ఆర్థిక సహాయం
- జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ప్రమాదంలో మరణించిన జనసేనా పార్టీ క్రియాశీల సభ్యులకు ఆర్థిక సహాయంగా 5 లక్షల రూపాయల చెక్కును జనసేన పార్టీ అందజేసినట్లు జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయి తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ముచ్చు వేలు గ్రామానికి చెందిన జనసేనపార్టీ క్రియాశీల సభ్యుడు వెంకట రామయ్య ప్రమాదవశాత్తు మరణిం చడం జరిగింది. కుటుంబ పెద్ద మరణించడంతో కుటుంబం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళగిరిలో ఆదివారం జనసేన క్రియాశీలక సభ్యుల ప్రమాద బీమా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించి బాధితులకు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ చెక్కులు పంపిణి చేశారు. అలాగే భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి, శ్రీకాళహస్తి మండ ల జనసేన పార్టీ అధ్యక్షులు దండి రాఘవయ్య, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంజీవ కుమార్‌కు ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర-పలమనేరు : 76వ గణతంత్ర దినోత్సవం సందర్బంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వి. సంజీవ కుమార్ వారి విధుల యందు మరియు నిర్దేశించిన లక్ష్యసాధనలో ఉత్తమ ప్రతిభ కనపరిచి నందులకు గాను ఉత్తమ ఉద్యోగి గా ప్రశంసా పత్రమును డిఐటియంఎ, చిత్తూరు వారి ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తన విధులకు సహకరించిన పలమనేరు ఎమ్మెల్యే అమర నాథ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ శాఖ, ఉన్నతాధి కారులకు మరియు మార్కెట్ కమిటీ సిబ్బందికి అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అరకొర ఔషధాలతో పంచాయతీలో
ఒక్కో గ్రామానికే పరిమితమైన పశు వైద్య శిబిరాలు

విశాలాంధ్ర - గుడిపాల : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత వైద్య శిబిరాలు పంచాయతీలలోని ఒక్కో గ్రామానికి పరిమితమై తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారని పాడి పశువుల రైతులు ఆవేదన చెందుతున్నారు, ఉదాహరణకు పంచాయతీలలో 7-10 గ్రామాలు ఉంటాయి గ్రామ గ్రామానికి 2-5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. వాటిలో మండలం లో ఒక్కో పంచాయతీకి కేవలం ఒకే ఒక గ్రామానికి ఉచిత పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తున్నారు. పంచాయతీలో అన్ని గ్రామాల పాడి పశు వులను ఒకే గ్రామానికి తరలించటం రైతులకు సాధ్యం కాని పని, వైద్యాధికారులకు వైద్యం అందించటంలో సాధ్యం కాదు, ఇక మిగిలిన గ్రామాల సంగతి ఏంటని రైతులు ప్రశ్నిస్తే అధికారుల ఆదేశాల మేరకు ఉన్న ఔషధాలతో ప్రస్తుతం ఒక్కో గ్రామానికి పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తొందరలో పంచాయతీలో అన్ని గ్రామాలకు కూడా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని పశు వైద్యాధికారి సాయి సుధా వెల్లడించారు.

ఉపాధ్యాయులు నాగరాజు పనితీరు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-సత్యవేడు: విధులు పట్ల నిబద్ధత, పాఠ్యాంశాల బోధన తదితర అంశాలపై ఉపాధ్యాయులు నాగరాజు పనితీరు తోటి ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తిరుపతి జిల్లా సత్యవేడు మండలం మదనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు చినబాబు చెప్పారు. గత క్యాలెండర్ సంవత్సరంలో 22 రోజులపాటు సెలవులు ఉన్న కేవలం ఒక్కరోజు సెలవు తీసుకొని విధులలో నిబద్ధత చాటుకున్న ఉపాధ్యాయులు నాగరాజును పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. పాఠశాల చైర్మన్ మాదా మునస్వామి అధ్యక్షతన హెచ్ఎం చినబాబు ఉపాధ్యాయులు నాగరాజుకు పూలమాలవేసి సాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భాస్కరన్, అమర్నాథ్ రెడ్డి, నాగమణి, పద్మావతి, స్వర్ణ పాల్గొన్నారు.

క్లీన్ కుప్పంలో భాగంగా పలు కార్యక్రమాలు

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం శివాలయం వద్ద చెరువు కట్ట నీటి కాలువను కౌన్సిలర్ సురేష్ మరియు తెదేపా బూత్ ఇంచార్జ్ గిరిధర్ బాబు లు కలిసి భారీ యంత్రాలతో శుద్ధి చేయించారు. కుప్పం లో ప్రతీ చోట మున్సిపల్ అధికారుల సహకారంతో పారిశుధ్య కార్యక్ర మాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తకుండా ఉండెందుకు ముందస్తుగానే అన్ని చోట్ల పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నామని తెలిపారు.

పరిశ్రమల స్థాపనకు అనువుగా ఆంధ్రప్రదేశ్

గత ఐదేళ్లలో రాని పెట్టుబడులు ఈ ఏడు నెలల్లో సాధించాం

చంద్రబాబు విజన్ తోనే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు -ఈ దశాబ్దాపు అద్భుత ఘట్టం యువగళం

మీడియా సమావేశంలో పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి

విశాలాంధ్ర-పలమనేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిశ్రమల స్థాపనకు స్వర్గధామిగా మారిందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతం కావడాన్ని హర్షిస్తూ సోమవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది అన్నారు. జగన్మోహన్ రెడ్డి చేసిన నిర్వాకానికి అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామిక రంగానికి కొత్త వెలుగులు తెచ్చేందుకు సీఎం చంద్రబాబు,నారా లోకేష్ లు రేయింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో తీవ్రమైన చలిని సైతం లెక్కచేయకుండా రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకురావడానికి వారు పడిన శ్రమ సత్ఫలితాలనిస్తాయన్నారు. చంద్రబాబు విజన్ కు మెచ్చి అమలు చేస్తున్న పాలసీలకు ఆకర్షితులై దేశ విదేశీ కంపెనీలు పారిశ్రామి కవేత్తలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తు న్నారన్నారు. ఐదేళ్లలో జగన్ మోహన్ రెడ్డి తీసుకురాలేనన్ని పెట్టుబడులను రాష్ట్రం ఏర్పడిన ఏడు నెలల్లోనే మనం సాధించామని తెలిపారు. 2019లో వైసీపీ వచ్చాక బ్రాండ్ ఏపీ గా ఉన్న మన రాష్ట్రాన్ని బిల్డప్ ఏపీ గా జగన్ రెడ్డి మారిస్తే తిరిగి సన్ రైజ్ ఏపీ గా నేడు చంద్రబాబు మార్చుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి ఐదు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని, తద్వారా 40వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. ఈ దశాబ్దాపు అద్భుత ఘట్టం యువగళంలిరాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యువనేత నారా లోకేష్ రెండేళ్ల క్రితం చేపట్టిన యువగళం పాదయాత్ర ఈ దశాబ్దపు అద్భుత ఘట్టంగా ఆయన అభివర్ణించారు.. తెలుగు నేల దద్దరిల్లేలా 27 జనవరి 2023 న పాదయాత్ర మొదలుపెట్టిన రోజు మా అందరి జీవితాలలో మర్చిపోని రోజు అని పేర్కొన్నారు. కుప్పం నుంచి మొదలైన ఈ యాత్ర 226 రోజులు 3132 కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్రలో నేను ప్రధాన భాగమైనందుకు సంతోషంగానూ గర్వంగానూ అనుభూతి చెందుతున్నాను. ఏదేమైనా యువగలం పాదయాత్ర రాష్ట్ర చరిత్రలో ఓ అద్భుత ఘట్టం అని పేర్కొన్నారు.

కుప్పం కెఈసి విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు

విశాలాంధ్ర - కుప్పం: అగస్త్య ఇంటర్నే షనల, శాంసంగ్ సంయుక్తంగా జోనల్ స్థాయిలో నిర్వహించిన 'అన్వేషణ 2025 ' ప్రాజెక్టుల పోటీలలో కుప్పం ఇంజనీరింగ్ కాలేజీలో చదివుతున్న బి.టెక్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మరియు మెషిన్ లెర్నింగ్ విభాగం నందు డా. లోకేష్ ఆధ్వర్యంలో మూడవ సంవత్సరం చదువుతున్న పావన.వి, శోభ.ఎస్ వీరిచే తయారు చేయబడిన ప్రాజెక్టు 'వేస్ట్ వర్త్' అంశంపైన రెండవ బహుమతిగా 12,000 రూపాయల నగదును గెలుచుకున్నారు. బి.టెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ విభాగంలో డా. లోగేష్ ఆధ్వర్యంలో మూడవ సంవత్సరం చదువుతున్న అబ్దుల్ తౌహిద్. ఎస్.కె, యం.అరుణ్ కుమార్ తయారు చేసిన ప్రాజెక్టు "బ్లేడ్ టెక్ ఇన్నోవేషన్" అనే అంశంపైన ఐదవ బహుమతిని పొందడం జరిగింది. అదేవిధంగా ప్రత్యేక ప్రోత్సాహక విభాగంలో బి.టెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో డా. లోగేష్ ఆధ్వర్యం లో మూడవ సంవత్సరం చదువుతున్న అరవింద్. వి,ఆకాష్.పి "స్మార్ట్ రివార్డ్" ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా ఆర్గానిక్ వేస్ట్ మేనేజ్మెంట్ ఇన్సెంటివ్ సిస్టమ్ ప్రాజెక్టుకు , అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.ఎస్. ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో మూడవ సంవత్సరం చదువుతున్న తనూజ, మేఘన.ఎన్ వీరిచే తయారు చేయబడ్డ "ఎకో స్పియర్ " అనే అంశాల మీద తయారు చేయబడ్డ ప్రాజెక్టులకు బహుమతులు లభించాయి. జోనల్ స్థాయిలో బహుమ తులను పొందిన విద్యార్థులు వచ్చే నెలలో హైదరాబాదులో నిర్వహిం చబడే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అర్హతను సాధించారు. కళాశాల చైర్మన్ బి.సి.నాగరాజ్, వైస్ చైర్మన్ డా.సునీల్ రాజ్, సెక్రటరీ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డా.ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎస్.భాస్కరన్, డా.కె.లోగేశ్, డా. జ్ఞానమూర్తి, ఎ.రవీంద్ర కుమార్ బహుమతులను పొందిన విద్యార్థులను అభినందించారు.

వెంకటేష్‌కు సిఆర్ రాజన్ నివాళులు

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: కొద్దిరోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన మాజీ జడ్పిటిసి జిల్లా పార్లమెంటు ఉపాధ్య క్షులు వెంకటేష్ కుటుంబాన్ని సోమవారం నాడు చిత్తూర్ టిడిపి అధ్యక్షులు సిఆర్ రాజన్ జిల్లా యాదవ సాధికారిక సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ జిల్లా టిడిపి కమిటీ కార్యదర్శి తలారి రెడ్డప్ప పెనుమూరు మండల టిడిపి అధ్యక్షులు రుద్రయ్య నాయుడు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పూర్ బుజ్జి భాస్కర్ దుర్గా ప్రసాద్ రెడ్డి మాధవరెడ్డి అన్నాదురై తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఎస్ఐ

విశాలాంధ్ర-దొరవారిసత్రం: దొరవారిసత్రం ఎస్ఐ అజయ్ కుమార్ బెస్ట్ ఆఫ్ అజయ్‌గా అందరి చేత అనిపించుకుంటున్నారు. స్టేషన్‌లో భాధ్యతలు చేపట్టనప్పటి నుండి అటు పోలీస్ స్టేషన్ రూపు రేఖలను మారిస్తూనే లా అండ్ ఆర్డర్‌పై ఫోకస్ పెట్టారు. గ్రామాల్లో తిరుగుతూనే నేరాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సులను ఏర్పాటు చేశారు. అనంతరం పోలీసులు,ప్రజలు మధ్య అపోహలు ఉండకూడదు అంటు ముఖ్యంగా గ్రామాల్లో యువతతో ఫ్రెండ్లీ పోలీసు విధానం అమలు చేశారు. దొరవారిసత్రం మండలంలోని గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు కట్టబడి పని చేస్తూ నిజాయితీ నిబద్ధత కలిగిన అధికారిగా మారి నేరస్తుల పాలిట సింహ స్వప్నంగా మారారు. వారం రోజుల క్రితం జరిగిన ఫ్లెమింగో ఫెస్టివెల్‌లో ఎస్ఐ అజయ్ కుమార్ చేసిన సేవ అందరి చేత శభాష్ అన్పించేలా చేశారు. దీంతో దీవిసత్రం అజయ్ కుమార్ కుమార్‌కు గణతంత్ర దినోత్సవము సందర్భంగా పోలీసు సేవలకు ఉత్తమ సేవా అవార్డులను అదే విధంగా ఫ్లెమింగో ఫెస్టివెల్‌లో చేసిన పనితీరుపై ఉన్నత అధికారులు గుర్తించి మరోక అవార్డులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతులు మీదుగా అందుకున్నారు. దీంతో దీవిసత్రం తహశీల్దారు శైలకుమారి, పలువురు అధికారులు, నాయకులు,ప్రజలు,తోటి అధికారులు ఆయనకు చరవాణీ ద్వారా అభినందనలు తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడి మృతి

విశాలాంధ్ర-పాకాల: పాకాల చిత్తూరు రైల్వే మార్గంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి మృతి చెందినట్లు పాకాల రైల్వే పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పాకాల-చిత్తూరు మార్గంలోని పూతలపట్టు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని యువకుడు రైలు కింద పడి మృతి చెంది ఉండగా స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమా చారం అందించారు. దీంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 25-35 సంవత్సరాలు మధ్య ఉంటుందని బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు, మెరూన్ కలర్ లుంగీ గడుల చొక్కా పచ్చ తెలుపు రంగుల డిజైన్ కల ఫుల్ చొక్కా ధరించి వున్నాడని అంతకుమించి ఎలాంటి ఆధా రాలు లభించలేదన్నారు. సోమవారం తెల్లవారుజామున కన్యాకుమారి పూనే ఎక్స్ ప్రెస్ కింద పడి మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. ఈ ఘటనపై రైల్వే ఇంఛార్జ్ ఎస్సై రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులను మోసగిస్తే చర్యలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ డి.గోపి హెచ్చరించారు. శ్రీకాళహస్తి ఆలయ పరిసరాల్లో సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అక్కడ భక్తులకు మాయమాటలు చెబుతూ మోసం చేస్తున్న వారిని గుర్తించారు. భక్తులను మోసం చేస్తున్న వారిని శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసు స్టేషన్ కు వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీఐ గోపి వారికి హెచ్చరికలు జారీ చేశారు. ముక్కంటి ఆలయానికి వచ్చే భక్తులకు మాయ మాటలు చెప్పి డబ్బు వసూలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులను మాయ మాటలతో మోసం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ గోపి హెచ్చరించారు.

నందమూరి బాలకృష్ణకి పద్మభూషణ్ రావడంపై సంబరాలు

విశాలాంధ్ర - పుంగనూరు: సినీ నటుడు హిందూపురం తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు నటసింహం నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ రావడంతో నందమూరి అభిమాన సంఘం నాయకులు మోపూరి మోహన్ రెడ్డి అప్పి రెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు నందమూరి అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వారసుడుగా సినిమాల్లోకి వచ్చి అనేక సినిమాల్లో అనేక పాత్రలను చేసి ప్రజలు నుండి మద్దతు పొందడం జరిగిందన్నారు. అంతేగాక బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ను నెలకొల్పి అనేకమందికి ప్రాణదానం చేస్తూ సేవే మార్గమంటూ ముందుకుపోవడంతో పాటు హిందూపురం టిడిపి శాసనసభ్యులుగా మూడు పర్యాయాలు గెలిచి ప్రజలకు అనేక సేవలు అందించిన మా నటసింహం నందమూరి బాలకృష్ణ కు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు అవార్డులు రివార్డులు మా అభిమాన నాయకుడు పొందాలని మనసా వాచా ఆ భగవంతున్ని కోరుకుంటున్నామన్నారు ఈ కార్యక్రమంలో నందమూరి అభిమాన సంఘం సభ్యులు టిడిపి నాయకులు సుబ్రమణ్యం రాజు చక్రపాణి గంగు లప్పా వెంకటరమణ పులి మోహన్ అంజిరెడ్డి రెడ్డప్ప లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మూడో ఎడిషన్ ప్రారంభం

విశాలాంధ్ర - పలమనేరు : ఒరిజినల్ సౌండ్ - బాలీవుడ్ మెలోడీస్, హిప్-హాప్ బీట్స్ కలయికను కళ, సంస్కృతి, గేమింగ్ అనుభవాలతో మిశ్రమం చేసిన రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మూడో ఎడిషన్ ఘనంగా ప్రారంభం చారు. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్, సింగర్ అమిత్ త్రివేది మాట్లాడుతూ ,"రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మ్యూజిక్ అందమైన సంబరం- హృదయం నుండి నేరుగా, సహజంగా, ప్రామాణీ కరంగా వచ్చిందన్నారు. గాయని నిఖిత గాంధీ మాట్లాడుతూ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్లో పెర్ఫార్మెన్స్ చేయడం గుర్తుండిపోయే అనుభవం అన్నారు. ప్రముఖ హిప్-హాప్ కళాకారుడు రఫ్తార్ మాట్లాడుతూ "ప్రభావం చూపించే బీట్స్, ఉద్వేగాలు ఎల్లప్పుడూ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్లో కీలకమైన అంశంగా ఉంటాయి అన్నారు. డీజే యోగి మాట్లాడుతూ "రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ప్రేక్షకులు మ్యూజిక్ ద్వారా సజీవమైన అనుభూతి చెందడానికి సంబంధించినది. సంచలనం కలిగించే వాతావరణం కలిగించడానికి బీట్స్ను శైలులను మిశ్రమం చేయడమే డీజేగా తన లక్ష్యం అని తెలి పారు. ఈ కార్యక్రమంలో మున్నాభాయి, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ కార్తీక్ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-పాకాల : సోమవారం పాకాల మండలంలోని ఉప్పర పల్లి గ్రామపంచాయతీ సూరినేని వారి పల్లెలో నిర్వహించిన ఉచితపశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పాకాల పశు వైద్య సంచాలకులు డాక్టర్ శ్రీధర్ బాబు పర్యవేక్షణలో పశు వైద్య అధికారిణి డాక్టర్ జానకమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో గ్రామంలోని పశువులకు పిడుదుల మందు పిచికారి చేసి,మేకలకు, దూడలకు నట్టల నివారణ మందు తాగించారు.గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసి మందులను పంపిణీ చేశారు. ఉచిత పశు వైద్య శిబిరాల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది కర్ణ పాడి రైతులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో పోస్టులన్నీ ఖాళీ

పంచాయతీరాజ్ డిఈ పోస్ట్ కూడా ఇన్చార్జి మయం

విశాలాంధ్ర- సత్యవేడు:సత్యవేడు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ కార్యాలయం బోసిపోతుంది. పలు పోస్టులు భర్తీ కాకపోవడంతో పిఆర్ ఇంజనీరింగ్ శాఖ నిర్వీర్యమవుతోంది.పంచాయతీరాజ్ డిఈ పోస్ట్ కూడా ఇన్చార్జ్ మయంగా మారడంతో కార్యాలయం వెలవెల బోతోంది. ముఖ్యంగా రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో అన్ని శాఖల్లోనూ అధికారుల బదిలీలకు శ్రీకారం చుట్టిన విషయం వేదికమే. ఇందులో భాగంగానే సత్యవేడు పంచాయ తీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో కూడా సెప్టెంబర్ అక్టోబర్లో అధికారుల బదిలీలు జరిగింది. ఈ నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న డిఈ మధుసూదన్ బదిలీ కావడంతో కొత్త డిఈ గ ఉమాశంకర్ నియమితులయ్యారు. గత ఏడాది అక్టోబర్లో సత్యవేడు పంచాయితీ రాజ్ రెగ్యులర్ డిఈ గా ఉమాశంకర్ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆయన బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజు నుంచి దీర్ఘకాలిక సెలవులు మీద వెళ్లినట్టు సమాచారం. దీంతో చిత్తూరు క్వాలిటీ కంట్రోల్లో పనిచేస్తున్న గోపిని సత్యవేడు ఇంచార్జ్ డిగా నియమితులు కావడంతో అదే నెలలో బాధ్యతలు స్వీకరించారు. ఏమైందో ఏమో గాని రెండు నెలలు పూర్తి కాకమునుపే ఇన్చార్జి డిఈ బాధ్యతలు తొలగించడంతో గోపి కూడా తిరిగి యధా స్థానానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో పుత్తూరు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ డీఈగా పనిచేస్తున్న వెంకటరమణకు ఇక్కడ ఇన్చార్జి బాధ్యతలను అప్పగించారు. అయితే ప్రస్తుతం ఇంచార్జి డీఈగా పని చేస్తున్న వెంకటరమణ ఇక్కడకు ఎప్పుడొస్తారో ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి ఏర్పడింది. పైగా ఎప్పుడూ ఖాళీ కుర్చీ కనిపిస్తోంది. దీంతోపాటు సత్యవేడు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ సంబంధించి పలు ఏఈ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. నాగలాపురం,పిచ్చాటూరు,కేవిబి పురం, నారాయణవనం మండలా లకు సంబంధించి ఏఈ పోస్టులు భర్తీకాని పరిస్థితి నెలకొం టుంది. పైగా బుచ్చినాయుడు కండ్రిగ మండలం పిఆర్ ఏఈగ పనిచేస్తున్న నాగరాజుకు వరదయ్యపాలెం ఏఈగా అదనపు బాధ్య తలు అప్పగించారు. ఈ క్రమంలో పంచాయతీరాజ్ శాఖకు సంబం ధించిన గ్రామీణ రోడ్లు, వాటి మరమ్మతులు,వంతెనల నిర్మాణాలకు సంబంధించి కొత్త ప్రతిపాదన సిద్ధం చేయడం వంటి పనులు సకాలంలో పూర్తి చేయాలంటే సాధ్యం కాని పరిస్థితి ఏర్పడుతుంది. ఇంజనీరింగ్ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఎక్కడైనా పిఆర్ సంబంధించిన పనులు చేపట్టిన వాటి పర్యవేక్షణ వీలు లేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి సత్యవేడు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో ఖాళీగా ఉన్న ఏఈ పోస్టును భర్తీ చేయడానికి తగు చర్యలు తీసుకోవడంతో పాటు రెగ్యులర్ డిఈని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయం కావాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట ఒక కుటుంబం నిరసన

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని మున్సిపాలిటీలో పనిచేసే సిబ్బంది చెన్నకేశవులు తన ఇద్దరు పిల్లలు భార్యతో కలిసి పుంగనూరు పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం రోజున న్యాయం కావాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా బాధితుడు చెన్నకేశవులు మాట్లాడుతూ నేను పట్టణంలోని కోనేటి పాలెంలో నివాసము ఉన్నారు. కానీ తమ ఇంటి ఎదుట ఉన్న సుజయ్ కుమార్ అనే యువకుడు నాలుగో తరగతి చదివే నా కుమార్తెను వెకిలి చేష్టలతో వేధింపులు చేస్తూ ఇబ్బంది పెట్టుతుంటే గత ఏడాది ఐదో నెలలో మొదటిసారి పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. కానీ పోలీసులు ఎటువంటి చర్యలు ఆ యువకునిపై తీసుకోకుండా మాకే కౌన్సిలింగ్ ఇచ్చి పంపేయడం జరిగిందన్నారు. కానీ మరలా ఆ యువకుడు పదేపదే మా కుమార్తెను మమ్మల్ని వేధింపులు చేయడం చేస్తుండడంతో మరల ఐదు మార్లు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కానీ అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనితో ఆ యువకుడు మమ్మల్ని చంపుతామని బెదిరిస్తున్నారు. తమకు న్యాయం కావాలని పలుమార్లు సీఐ దృష్టికి తీసుకుని వెళ్లిన న్యాయం జరగలేదు. కాబట్టి సోమవారం రోజున పోలీస్ స్టేషన్ ఎదుట మా కుటుంబంతో వచ్చి నిరసన చేపట్టామన్నారు. ఇప్పటికైన ఆ యువకుడ్ని అరెస్ట్ చేసి న్యాయం చేస్తే సరే లేకపోతే కుటుంబమంతా పోలీసులు న్యాయం చేయలేదని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిస్తున్నామన్నారు. దీనిపై సీఐ శ్రీనివాసులును వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి అతన్ని అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందన్నారు. వారు కోర్టును ఆశ్రయించి బెయిల్ తీసుకోవడం వలన అరెస్టు చేయలేకపోతున్నామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఆ యువకుడి పై చర్యలు చేపడతామన్నారు.

ఏపీకే 5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మీడియా సమావేశం నిర్వహించిన వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ శాసనసభ్యుల సమావేశం నందు మాట్లాడుతు ధావోస్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ 40 నూతన కంపెనీలతో భేటీ జరిపి దాదాపు 5 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు తెచ్చి రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి రూరల్ మండల అధ్యక్షులు,తిరుపతి పార్లమెంట్, రాష్ట్ర, పట్టణ, యువత, ఐటిడిపి, మహిళ అనుబంధ కమిటీ సభ్యులు, తెలుగుదేశం,జనసేన ,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండలం లోని కంచన పుత్తూరు గ్రామం లోని అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సర్పంచ్ బట్ట స్వప్న యాదవ్ తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం తాసిల్దార్ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో నివాసానికి ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని వినతిపత్రం సమర్పించాము. కానీ ఇచ్చిన వినతి పత్రానికి ఎలాంటి స్పందన లేకపోవడంతో గ్రామస్తులు వేదన చెందుతున్నారు, రెవెన్యూ అధికారులు ఇచ్చిన వినతి పత్రానికి స్పందించి నిరుపేదలైన అర్హులకు ఇంటి స్థలాలు పంపిణీ చేయడానికి చొరవ చూపాల్సిన అవసరం ఉంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై తాసిల్దార్ స్పందిస్తూ ఇచ్చిన వినతి పత్రానికి పూర్వపరాలు పరిశీలించి స్థలాన్ని కోసం ప్రభుత్వ భూములు గుర్తించి పంపిణీ చేయడానికి జిల్లా అధికారులు ఆదేశాలు మేరకు న్యాయం చేస్తామని వెల్లడించారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం చేయాలని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముక్కంటి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఏర్పాట్లను సోమవారం ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. మహాశివరాత్రి పర్వదినాన క్యూలైన్లు ఎలా ఏర్పాటు చేస్తున్నారో ఇంజనీరింగ్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసే అవకాశం ఉన్నందున తొక్కిసలాట జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాన్య భక్తులకు సులభ దర్శనం జరిగేలా చూడాలన్నారు. ఇక బ్రహ్మోత్సవాల సందర్భంగా పూల అలంకరణ బాగా చేయాలన్నారు. పూలు, విద్యుత్ అలంకరణలు ఎలా చేయాలో అధికారులకు ఆయన సూచనలు చేశారు. ఆలయంలో అలంకరణలు ఆకట్టుకునేలా ఉండాలన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇందుకు అవసరమైన సహకారం తాను అందిస్తానని ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆలయ అధికారులు సమన్వయంతో పని చేసి బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి చేయాలని ఆయన ఆదేశించారు. ఈయన వెంట ఆలయ ఈవో టి.బాపిరెడ్డి, ఈఈ మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీ నాణ్యతగా పరిష్కారించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓలు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ తో పాటు డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు: రెవెన్యూ -158, సర్వే అండ్ ల్యాండ్స్-6, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్-14, ఎండోమెంట్-4, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్-2, పోలీస్-12, గిరిజన సంక్షేమ శాఖ -1, ఐసిడిఎస్ -6, స్కూల్ ఎడ్యుకేషన్ -8, ఎస్సీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్-2, పంచాయతీరాజ్ -17, మెడికల్ ఎడ్యుకేషన్ -1, సివిల్ సప్లై -6, ఫిషరీస్ -2, ఏపీఎస్పీడీసీఎల్ -2, రూరల్ డెవలప్మెంట్ -1, పశుసంవర్ధక శాఖ- 2, సర్ఫ్-3, ఆర్డబ్ల్యూఎస్-5, మార్కెటింగ్-1, హౌసింగ్-1, ఎక్సైజ్ - 3, నేషనల్ హైవే -1, టీటీడీ -1, ఎంప్లాయిమెంట్ -1 డ్రగ్ ఇన్స్పెక్షన్ -1 వెరసి మొత్తం 261 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

టిటిడి బోర్డు అత్యవసర భేటీ

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: టీటీడీ పాలకమండలి బోర్డు ఈనెల 31న అత్యవసరంగా సమావేశం కానుంది వచ్చే నెల 4న తిరుమలలో నిర్వహించుచున్న రథసప్తమి వేడుకల ఏర్పాట్లు పైన సమావేశం కావాలని నిర్ణయించారు. తిరుపతి తొక్కిసలాట ఘటన తర్వాత రథసప్తమి వేల భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ముందుగానే ఏర్పాట్లు పైన సమీక్షించాలని నిర్ణయం తీసుకున్నారు కాగా రథసప్తమి వేల ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకున్న టిటిడి భక్తులకు కీలక సూచనలు చేసింది టీటీడీ పాలకమండలి సభ్యులకు ఈనెల 31న జరిగే అత్యవసర సమావేశానికి హాజరుకావాలని సమాచారం అందింది రథసప్తమి వేడుకల నిర్వహణ పైన సమీక్ష చేయనున్నారు శ్రీవారి ఉత్సవాల్లో రథసప్తమి అత్యంత ముఖ్యమైనది ఈ వేడుకకు దాదాపు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు రథసప్తమి వేడుకల్లో భాగంగా స్వామివారు సప్త వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు. ఫిబ్రవరి 4న ఉదయం 5:30 గంటలకు సూర్యప్రభ వాహన సేవతో రథసప్తమి వేడుకలు ప్రారంభం అవుతాయి అదేరోజు రాత్రి చంద్రప్రభ వాహన సేవతో శ్రీ మలయప్ప స్వామి వారి వాహన సేవలు ముగుస్తాయి రథసప్తమి సందర్భంగా ప్రివిలేజ్ దర్శనాలు పలు సేవలు రద్దు చేస్తూ టీటీడీ నిర్ణయం తీసుకుంది అష్టదళ పాద పద్మారాధన ఊంజల సేవ కళ్యాణోత్సవం సహస్ర దీపాలంకరణ ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలు రద్దు చేశారు. ఎన్ఆర్ఐలు సీనియర్ సిటిజెన్లు చంటి బిడ్డల తల్లిదండ్రులు వికలాంగులు ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు తిరుపతిలో వచ్చే నెల 3 నుంచి 5 వరకు స్లాటేడ్ సర్వదర్శనం టోకన్లు జారీ చేయడం లేదని ప్రకటించారు. ఇక ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. బ్రేక్ దర్శనాలకు సంబంధించి వచ్చేనెల 3న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించరని టీటీడీ అధికారులు తెలిపారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టోకన్ ఉన్న భక్తులు వేచి ఉండకుండా ఉండేందుకు నిర్జిత టైంలో మాత్రమే వైకుంఠం క్యూ క్యాంప్లెక్స్ వద్ద రిపోర్ట్ చేయాలని టిటిడి సృష్టం చేసింది.

కనకదుర్గ గోల్డ్ లోన్ బ్యాంకులో
ఘరానా మోసం

నకిలీ గోల్డ్ పెట్టి ఒరిజినల్ బంగారుతో ఉడాయించిన బ్యాంకు సిబ్బంది

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో ఉన్న కనకదుర్గ గోల్డ్ లోన్ బ్యాంకులో ఘరానా మోసం జరిగిందని యాజమాన్యం పుంగనూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయడం జరిగింది. యాజమాన్యం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమ బ్యాంకు నందు పట్టణ ప్రజలు తమ అవసరాలుకు గోల్డ్ పెట్టి రుణం పొందడం జరిగిందన్నారు. అందులో రూ.2.80 కోట్ల విలువైన బంగారము బ్యాంకులో పనిచేసే ఐదుగురు సిబ్బంది కుమ్మక్కై ఒరిజినల్ బంగారు తస్కరించి నకిలీ బంగారం బ్యాంకులో ఉంచడం జరిగిందన్నారు. ఈ విషయం బయటకు రావడంతో వారు పరారవడంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని, వారందరికీ యాజమాన్యం భరోసాగా నిలుస్తుందని తెలిపారు. పారిపోయిన నిందితులను పోలీసులు వెంటనే పట్టుకుని రికవరీ చేయాలని కోరుతున్నామన్నారు.

ఇరువారం దళితులకు న్యాయం చేయాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన

- సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు సంఘీభావం

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూర్ నగర పరిధిలోని ఇరువారం రెవెన్యూ లెక్క దాఖల కాజూరు సర్వేనెంబర్ 154 /1 లో 50 సెంట్లు విస్తీర్ణం గల భూమి వంశపార్యపరంగా పుంగావనం, ఆదెమ్మ, జయపాల్, టైటాస్ అనుభవిస్తూ ఉన్న భూమిని రెడ్డి ప్రసాద్ అను అతనికి 2023 ఆగస్టు నెల విక్రయించడం జరిగింది ఆనాటి నుండి నేటి వరకు రణధీర్ అనే అతను దళితుల భూములపై దౌర్జన్యం చేయడానికి వ్యతిరేకంగా చిత్తూరు జిల్లా కలెక్టర్‌కి ఇరువారం దళితులు టైటాన్స్, స్వామివెల్ అర్జీ ఇచ్చిన తర్వాత కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఇరువారం దళితులు చేస్తున్న నిరసనకు సంఘీభావంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ వంశపారపర్యంగా దళితుల అనుభవంలో ఉన్న భూములపై అగ్రవర్ణాల వారు దళితులపై దౌర్జన్యం చేయడాన్ని, దళిత భూములను కబ్జా చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అన్ని రికార్డులు దళితులకు సంబంధించిన టైటాస్ పేరుపై ఉండగా దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. అధికార పార్టీని అడ్డం పెట్టుకొని అధికారులను ఉపయోగించుకొని దళితులపై దౌర్జన్యం చేస్తే పార్టీకి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని రెవెన్యూ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చి వారి రికార్డులను పరిశీలించి సర్వే నంబర్ 154/1 లోని 50 సెంట్లు భూమి పూర్వీకుల నుండి వంశపారపరంగా ఎవరు పైన ఉందో రికార్డులను నిర్ధారించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు పి రఘు, బాధితులు టైటాస్, సామెల్ ఇరువారం దళితులు పాల్గొన్నారు.

రేపే జిఎస్ఎల్వి-ఎఫ్ 15 రాకెట్ ప్రయోగం

- షార్ నుండి 100వ రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం

- 29 ఉదయం 6 గంటల 23 నిమిషాలకు జీఎస్ఎల్వీ- ఎఫ్ 15 రాకెట్ ప్రయోగం

విశాలాంధ్ర-సూళ్లూరు పేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి ఈనెల 29వ తేదీ ఉదయం 6 గంటల 23 నిమిషాలకు జిఎస్ఎల్వి-ఎఫ్ 15 ను శ్రీహరికోటలోని రెండవ ప్రయాగ వేదిక నుండి నింగిలోకి పంపి సెంచరీ సాధించేందుకు ఇస్రో సర్వం సిద్ధం చేసింది. ఈ ప్రయోగానికి సంబంధించి కౌంటర్ ప్రక్రియ 27 గంటలు కొనసాగుతుంది. 28 ఉదయం 04:23 నిమిషాలకు కౌంట్ డౌన్ ప్రారంభమవుతుంది. ఈ కౌంట్ డౌన్ సమయాన్ని మంగళవారం శాస్త్రవేత్తలు నిర్వహించనున్న ఎంఆర్ఆర్ సమావేశంలో అధికార పూర్వకంగా ప్రకటిస్తారు. ఎఫ్ 15 అనేది భారతదేశం యొక్క జియోసింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (జిఎస్ఎల్వి) యొక్క 17వ రాకెట్ మరియు స్వదేశీ క్రయో స్టేజ్‌తో 11వ రాకెట్. ఇది స్వదేశీ క్రయోజెనిక్ స్టేజ్‌తో జిఎస్ఎల్వి యొక్క 8వ ఆపరేషనల్ ఫ్లైట్ మరియు భారతదేశం యొక్క శ్రీహరికోట పోర్ట్ నుండి 100వ లాంచ్. జిఎస్ఎల్వి-ఎఫ్ 15 పేలోడ్ ఫెయిరింగ్ ఎ 3.4 మీటర్ల వ్యాసం కలిగిన లోహ వెర్షన్. స్వదేశీ క్రయోజెనిక్ దశతో కూడిన జిఎస్ఎల్వి-ఎఫ్ 15 ఎన్‌విఎస్-02 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ఉంచుతుంది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని రెండవ లాంచ్ ప్యాడ్ (ఎస్ఎల్‌పి) నుండి ప్రయోగం జరుగుతుంది. నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టెలేషన్ (ఎన్‌ఎవిఐసి) అనేది భారతదేశం యొక్క స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్, ఇది భారతదేశంలోని వినియోగదారులకు అలాగే భారత భూభాగానికి మించి 1500 కి.మీ విస్తరించి ఉన్న ప్రాంతానికి ఖచ్చితమైన స్థానం, వేగం మరియు సమయ (పివిటి) సేవలను అందించడానికి రూపొందించబడింది. ఎన్‌ఎవిఐసి రెండు రకాల సేవలను అందిస్తుంది. అవి స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్ (ఎస్‌పిఎస్) మరియు రిస్ట్రిక్టెడ్ సర్వీస్ (ఆర్ఎస్) ఎన్‌ఎవిఐసి యొక్క ఎస్‌పిఎస్ 20 ఎ (2ఎస్) కంటే మెరుగైన స్థాన ఖచ్చితత్వాన్ని మరియు సేవా ప్రాంతంలో 40 ఎన్ఎస్ (2ఎస్) కంటే మెరుగైన సమయ ఖచ్చితత్వాన్ని అందిస్తుంది. ఈ ప్రయోగం నూతనంగా ఇస్రో చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన వి.నారాయణన్ ఆధ్వర్యంలో ఇది మొదటి ప్రయోగం. ఈ ప్రయోగం విజయవంతం కావాలని మనము ఆశిద్దాం...